## వైభవంగా అయ్యప్ప స్వామి పడిపూజ, అన్నదాన కార్యక్రమ వేడుకలు

అమరాపురం జనవరి 13 ప్రభాతవార్త




ప్రత్యేక అలంకరణలు అయ్యప్ప స్వామి దృశ్యం ,పూజలు నిర్వహిస్తున్న అర్చకుల దృశ్యం

మండల పరిధిలోని కెంకెర గ్రామంలో వెలసిన అయ్యప్ప స్వామి దేవాలయం వద్ద బుధవారం హరిహరపుత్ర అయ్యప్ప స్వామి పడిపూజ కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పురోహితుల వేద మంత్రాలకు వైభవంగా నిర్వహించారు. ప్రతి ఏడాది లాగే మకర సంక్రాంతి సందర్భంగా అయ్యప్ప స్వామి దేవాలయంలో స్వామివారికి అభిషేకం, అర్చనలు విశేష పూజా కార్యక్రమాలను శ్రీ హరిహరపుత్ర అయ్యప్ప స్వామి సేవా సమితి మరియు గ్రామ ప్రజల ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున కార్యక్రమాన్ని నిర్వహించారు. హరిహరపుత్ర అయ్యప్ప స్వామి సేవా సమితి సభ్యులు జి హెచ్ రాయుడు, జి శ్రీనివాస్, జి హనుమంతరాయ, కేహెచ్ సురేష్, హెచ్ రఘు కుమార్, కించప్ప, సోమశేఖర, గుజ్జారప్ప, తదితరులు సమక్షంలోఅయ్యప్ప స్వామి పడిపూజ నిర్వహించగా, అన్నదాన కార్యక్రమాన్ని కేకేఆర్ ఫ్రెండ్స్ ఫరెవర్ గ్రూప్ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాన్ని పెద్ద ఎత్తున ఏర్పాటు చేసి విచ్చేసిన భక్తులకు అన్నప్రసాదాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో కేంకెర గ్రామ ప్రజలు మరియు చుట్టు ప్రక్కల గ్రామాల భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి కి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

## ప్రజలందరూ సుఖసంతోషాలతో జీవించాలి- చిలకం



భోగిమంటలు వేసుకుంటున్న జనసేన రాష్ట్రప్రధానకార్యదర్శి చిలకం, నాయకులు

దర్మవరంటౌన్, జనవరి14 ప్రభాతవార్త

జనసేన పార్టీ రాష్ట్ర ప్రదానకార్యదర్శి చిలకం మధుసూదన్రెడ్డి, ఆ పార్టీనాయకులతో కలిసి తెల్లవారుజామున బోగిమంటలు వేసి పూజలు చేశారు. సంక్రాంతి వేడుకల్లో భాగంగా భోగి పండుగ వేడుకలు జరుపుకున్నారు. అనంతరం చిలకం మాట్లాడుతూ.... ధర్మవరం నియోజకవర్గ ప్రజలం దరూ జీవితంలో అన్ని కష్టాలు, చెడు ప్రభావాలు తొలగిపోయి భోగభాగ్యాలు కలగాలని కోరుకుంటూ భోగి, సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు.

## జిల్లాస్థాయి క్రికెట్ టోర్నీ ప్రారంభం



క్రికెట్ పోటీలను ప్రారంభిస్తున్న గ్రామ పెద్దలు

వజ్రకరూరు జనవరి 14 ప్రభాతవార్త

మండలంలోని గంజిగుంట గ్రామంలో సంక్రాంతి పండుగను పురస్కరించుకొని బుధవారం జిల్లాస్థాయి టెన్నిస్ బాల్ క్రికెట్ పోటీలు గ్రామ పెద్దల సమక్షంలో బుధవారం ప్రారంభమయ్యాయి. ఈ పోటీలలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి 86 జట్లు పాల్గొనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. విజేతలుగా నిలిచిన జట్టుకు 60 వేల రూపాయలు, ద్వితీయ స్థానంలో నిలిచిన జట్టుకు 30 వేల రూపాయలు,తృతీయ స్థానంలో నిలిచిన జట్టుకు పదివేల రూపాయలను బహుమతిగా అందజేయనున్నట్లు తెలిపారు.

## మంత్రి సవితమ్మకు... కాషాయనేతల శుభాకాంక్షలు

గోరంట్ల, జనవరి 14 ప్రభాతవార్త



మంత్రికి స్వీట్ తినిపిస్తున్న మండల అధ్యక్షులు

రాష్ట్ర బిసి సంక్షేమ, చేనేత జౌళి శాఖా మంత్రి సవితమ్మ పుట్టినరోజు సందర్భంగా గోరంట్ల మండల బిజెపి నాయకులు మండల అధ్యక్షులు బోయ లక్ష్మినారాయణ, సోషల్ మీడియా జిల్లా కోకన్వీనర్ మేదర శ్రీనివాసులు, ఓబిసి మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటాచలం కలిసి మంత్రికి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేశారు.

## జొన్న ఆదిలక్ష్మమ్మకు వైసిపి నాయకులు నివాళులు

-నివాళులు అర్పించిన...రాజారెడ్డి, ప్రమీలమూర్తి, సుబహాన్, సోము, అతావుల్లా

గోరంట్ల, జనవరి 14 ప్రభాతవార్త



నివాళులు అర్పిస్తున్న వైసిపి నాయకులు

గోరంట్ల మేజర్ పంచాయితీ 1వ వార్డు పరిధిలోని 2వ బ్లాక్ వార్డు సభ్యురాలు జొన్న ఆదిలక్ష్మమ్మ అనారోగ్యంతో బాధపడుతూ చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచిన నేపథ్యంలో మండల వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆమెకు నివాళులర్పించారు. పార్టీ జిల్లా అధ్యక్షులు కెవి ఉషాశ్రీ చరణ్ ఆదేశాల మేరకు గోరంట్ల మండల వైసిపి ముఖ్య నాయకులు బుధవారం వారి స్వగృహానికి వెళ్లి మండల పార్టీ తరుపున జొన్న ఆదిలక్ష్మమ్మ పార్థివ దేహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించి వారి కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ఈ సందర్భంగా మండల ప్రజాప్రతినిధులు వైఎస్ఆర్ సిపి నాయకులు, కార్యకర్తలు వెళ్లి వార్డు సభ్యురాలు జొన్న ఆదిలక్ష్మమ్మ పార్థివ దేహం వద్ద నివాళులు అర్పించడం జరిగింది. ఈ కార్యక్రమంలో మేజర్ పంచాయితీ ఉపసర్పంచు రాజారెడ్డి, ఎంపిపి ప్రమీలమూర్తి, వార్డు మెంబర్ సుబహాన్, ఎంపిటిసి సోమశేఖర్, వార్డు మెంబర్ అతావుల్లా, గుడిసె నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

## ఎడ్లబండ్లను ఎక్కి ఎంచక్కా సంక్రాంతి సంబరాలు

- పోటీల్లో పాల్గొన్న మహిళలందరికీ చీరల పంపిణీ - సంక్రాంతి సంబరాలు అంబరాన్నంటాయి




ఎడ్ల బండ్లపై సంక్రాంతి సంబరాలకు గుండుమల , కోళ్ల పందెలను తిలకిస్తున్న దృశ్యం

అగళి, జనవరి 14 ప్రభాతవార్త

అగళి మండలంలో జరిగిన సంక్రాంతి సంబరాలు ప్రజల్లో వింతజోష్‌ను నింపాయి. ఈ సంక్రాంతి సంబరాల కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రాష్ట్రటిడిపిఉపాధ్యక్షులు గుండుమల తిప్పేస్వామి, తెలుగుదేశంపార్టీ రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాస్‌మూర్తి, రాష్ట్ర వక్కలిగ కార్పొరేషన్ చైర్మన్ లక్ష్మినారాయణ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఒక్క అగళి గ్రామం నుంచే కాకుండా మహిళలు ఉత్సాహంగా వచ్చి ముగ్గులపోటీల్లో పాల్గొన్నారు. మండలంలోని రైతులు ఆవులు, ఎద్దులను ప్రత్యేకంగా అలంకరించి సంక్రాంతి పండుగ సందర్భంగా ప్రదర్శనకు తీసుకొచ్చారు. కత్తికట్టిన కోళ్ల పందెలు నిషేదం కావున, కత్తికట్టని కోళ్లతో పందెలను నిర్వహించారు. గత పూర్వీకులు చేస్తున్న సంక్రాంతి పండుగ వేడుకలు కళ్లకు కట్టినట్లు నిర్వహించారని వక్తలు అభిప్రాయ పడ్డారు. మరిచి పోతున్న పండుగలను సంస్కృతి సాంప్రదాయాలను గుర్తు చేసుకుని బావితరాలకు వాటిని అందించడానికి ఇక్కడి రైతులు, మహిళలు, రైతులు కృషి చేశారని తెలిపారు. సంక్రాంతి అంటే రైతులు ఆరుగాలం కష్టించి పని చేసి దాని ఫలితంగా పంటలను ఇంటికి చేర్చడమే దీని ఉద్దేశ్యం. ఇంటిల్లిపాది ముగ్గులను ఎందుకు వేస్తారంటే లక్ష్మిదేవిని ఇంటిలోకి ఆహ్వానించడం కోసం ముగ్గులను వేస్తారని, ఇది అనాధిగా వస్తున్న సాంప్రదాయమని, అదే ఒరవడిని ఈ రోజు మండలంలో కొనసాగించారని అన్నారు. అన్నదాత సుఖీభవ కింద వేల కోట్లను రైతులఖాతల్లోకి జమా చేశామని, తల్లికి వందనం కింద ఇంట్లో ఎంత మంది పిల్లలు చదువుతన్నా వారందరికీ 15 లక్షల మంది పిల్లలకు డబ్బులు ఖాతాల్లోకి జమా చేశామని, మహిళలకు స్త్రీ శక్తి కింద ఉచిత బస్సు ప్రయాణం వంటివి కల్పించారని తెలిపారు. రంగవల్లులు, గొబ్బెమ్మలు ఈ పండుగలోని ప్రత్యేకత అని, సంక్రాంతి అంటే సూర్యుడు ధనుస్సు రాశి నుంచి మకర రాశిలోకి ప్రవేశించడాన్ని మకర సంక్రాంతి అంటారని తెలిపారు. సంక్రాంతి సంబరాల నిర్వాహణకు ప్రత్యేక చొరవ చూపిన జడ్పిటిసి ఉమేష్‌ను, రాష్ట్ర టిడిపి ఉపాధ్యక్షులు గుండుమల తిప్పేస్వామి, శ్రీనివాస్‌మూర్తి, లక్ష్మినారాయణ, గురుమూర్తి, తదితరులు అభినందించారు.

## మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ.... పీపీపీ విధానం జీవో ప్రతులను భోగి మంటల్లో దగ్ధం చేసిన వైఎస్సార్‌సీపీ

- ప్రజల గుండెల్లో మండే ఆవేదనను వ్యక్తపర్చడమే ఉద్దేశమని వెల్లడి

ఉరవకొండ, జనవరి 14 ప్రభాతవార్త



ఉరవకొండలో భోగి మంటల్లో మెడికల్ కాలేజీలను ప్రైవేటుకు అప్పగించే పీపీపీ విధానం జీవో ప్రతులను దగ్ధం చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

మెడికల్ కాలేజీలను ప్రైవేటుకు అప్పగిస్తూ రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ పీపీపీ విధానం ప్రభుత్వ జీవో ప్రతులను వైఎస్సార్‌సీపీ శ్రేణులు భోగి మంటల్లో దగ్ధంచేసి నిరసన తెలిపాయి. పార్టీ నియోజకవర్గ ఇంచార్జ్, మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి ఆదేశాల మేరకు బుధవారం పట్టణంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయం ముందు భోగి మంటలువేసి అందులో జీవో ప్రతులను వేసి దగ్ధంచేశారు. ఈసందర్భంగా నాయకులు మాట్లాడుతూ రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం ప్రజల ఆశలు, ఆకాంక్షలకు వ్యతిరేకంగా మెడికల్ కాలేజీలను ప్రైవేటుపరం చేయడానికి వేగంగా అడుగులు వేస్తుండటంతో రాష్ట్ర ప్రజల గుండెలు మండిపోతున్నాయని తెలియజేయడానికే పీపీపీ విధానం జీవో ప్రతులను దగ్ధం చేయడం జరిగిందన్నారు. పేద, సామాన్య, మధ్య తరగతి ప్రజలకు వైద్యం, వైద్య విద్యను దూరం చేయడానికి రాష్ట్రంలోని చంద్రబాబునాయుడు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం కుట్ర చేస్తోందన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రజా ఉద్యమంలో భాగంగా ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కోటి సంతకాలు సేకరించి రాష్ట్ర గవర్నర్‌కు రాష్ట్ర ప్రజల ఆకాంక్షను సంతకాల రూపంలో అందించినా ప్రభుత్వంలో మార్పు లేదని మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి యం.అశోక్‌కుమార్, రూరల్ మండల అధ్యక్షులు జి.ఎర్రిస్వామిరెడ్డి, మండల సమన్వయకర్త మూలగిరిపల్లి ఓబన్న, పార్టీ బీసీ సెల్ నియోజకవర్గ అధ్యక్షులు డిష్ సురేష్, నాయకులు మారేష్, మహానంది, జోగి భీమా, కురుబ ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా ముగిసిన ధనుర్మాసం ఉత్సవాలు



అమ్మవారిని అలంకరించిన దృశ్యం

గుత్తి, జనవరి 14 ప్రభాతవార్త

గుత్తి పట్టణంలోని శ్రీవాసవి కన్యకాపరమేశ్వరి దేవస్థానంలో గత నెల రోజులుగా జరుగుతున్న ధనుర్మాస ఉత్సవాలు బుధవారం ఘనంగా ముగిశాయి. ఈ సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకులు వాసుదేవశర్మ ఆధ్వర్యంలో ధనుర్మాస యజ్ఞం పూర్తి అయింది. ఈ సందర్భంగా గోదా రంగనాథ స్వామి మరియు శ్రీదేవి భూదేవి సమేత లక్ష్మీవెంకటేశ్వరస్వామి, సీతారామలక్ష్మణఆంజనేయస్వామి విగ్రహాలకు ప్రత్యేక పూజలు గావించారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం మహిళా మండలి యువజన సంఘం సభ్యులు పాల్గొన్నారు.

## బిజెపి ఎస్టి మోర్చా అధ్యక్షుడిగా ఆదినారాయణ

గుత్తి, జనవరి 14 ప్రభాతవార్త



నియామకపత్రం అందచేస్తున్న దృశ్యం

భారతీయ జనతా పార్టీ అనుబంధ విభాగమైన ఎస్టి మోర్చా పట్టణ అధ్యక్షుడిగా ఎరుకల ఆదినారాయణను నియమించారు. ఈ మేరకు అధ్యక్షులు బిసి వెంకప్ప నియామక పత్రం అందజేశారు. పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కిసాన్ మోర్చా రాయలసీమ ఇన్‌చార్జ్ తిమ్మారెడ్డి, నాయకులు నారాయణరెడ్డి, లక్ష్మయ్య, రొయ్యల నారాయణ, రాజశేఖర్‌రెడ్డి, నూరు హసన్‌బాష, ప్రేమ్‌కుమార్, కందుల హేమలత, బాలకృష్ణ, ఆకుల శ్రీనివాస్, జనార్ధన్, రంగరాజు, పవన్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

## మంత్రి సవిత జన్మదిన కార్యక్రమాల్ని విజయవంతం చేయండి

అర్బన్ టిడిపి కన్వీనర్స్ శ్రీరాములు పిలుపు

పెనుకొండ జనవరి 14 (ప్రభాతవార్త)

బీసీ సంక్షేమ శాఖ మంత్రి ఎస్. సవితమ్మ జన్మదినాన్ని పురస్కరించుకొని గురువారం పెనుకొండ పట్టణంలోని పట్టణ తెదేపా కార్యాలయం అన్నా క్యాంటీన్ ఆఫీసు వద్ద ఉదయం 9.30 గంటలకు కేక్‌కట్ చేసి జన్మదిన వేడుకలు నిర్వహించబడతాయని పెనుకొండ అర్బన్ టిడిపి కన్వీనర్ శ్రీరాములు తెలిపారు. ఈ కార్యక్రమంలో తెదేపా,బీజేపీ, జనసేన పార్టీ నాయకులు,కార్యకర్తలు,స్టోర్ డీలర్లు,మంత్రి సవితమ్మ అభిమానులు,ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని శ్రీరాములు ఓ ప్రకటన ద్వారా పిలుపునిచ్చారు.



పెనుకొండ అర్బన్ టిడిపి కన్వీనర్ శ్రీరాములు

## జిల్లా ఎస్పీ ఆదేశాలతో అసాంఘిక కార్యకలాపాలపై డ్రోన్లతో పరిశీలన

పుట్టపర్తి టౌన్, జనవరి 14, ప్రభాతవార్త



డ్రోన్లతో పర్యవేక్షణ చేపట్టిన పోలీసు అధికారులు

జిల్లా ఎస్పీ సతీష్ కుమార్ ఆదేశాలతో అసాంఘిక కార్యకలా పాలపై ప్రత్యేక నిఘా పెట్టినట్లు అధికారులు తెలిపారు. బుధవారం జిల్లావ్యాప్తంగా పరిసర అటవీ ప్రాంతాల్లో భద్రతా చర్యలను మరింత బలోపేతం చేసేందుకు పోలీసు శాఖ ప్రత్యేక డ్రోన్ పర్యవేక్షణ నిర్వహించారు. సంక్రాంతి పండుగ సందర్భం గా జిల్లాలో బహిరంగ ప్రదేశాలలో మద్యం సేవించేవారు, సాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారిపై, అటవీ ప్రాంతాల్లో అనుమానాస్పద వ్యక్తుల సంచారం, అక్రమ కార్యకలాపాలపై ప్రత్యేక నిఘా నిర్వహించినట్లు తెలిపారు. ముఖ్యంగా ప్రజా భద్రతకు విఘాతం కలిగించే పరిస్థితులను గుర్తించేందుకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తూ పోలీస్ అధికారులు, సిబ్బందితో కలిసి డ్రోన్ ద్వారా ఆ ప్రాంతంలోని భౌగోళిక పరిస్థితులు, మార్గాలు, చెరువులు, మరియు అనుమానాస్పదగా కనిపించే చలనాలను రికార్డు చేయడం జరిగిందన్నారు. పోలీసు అధికారుల సమాచారం ప్రకారం, ఇటువంటి డ్రోన్ పర్యవేక్షణలు తరచుగా నిర్వహించడం ద్వారా మండలంలో నేర కార్యకలాపాలను అరికట్టడంలో పెద్దగా ఉపయోగపడుతుందని, ప్రజలు ఎటువంటి అనుమానాస్పద చలనం గమనించినా వెంటనే పోలీసులకు తెలియజేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

## నేడు ఉరవకొండలో చౌడేశ్వరిదేవి జ్యోతుల మహోత్సవం

-అర్ధరాత్రి దాటిన తరువాత మొదలు కానున్న ఉత్సవం

-ఎల్ఈడీ విద్యుత్ తోరణాలతో వెలుగులు విరజిమ్ముతున్న పట్టణం



ఉరవకొండలో ప్రధాన రోడ్లలో వెలసిన ఎల్ఈడీ విద్యుత్ దీపాల స్వాగత తోరణం

ఉరవకొండ, జనవరి 14 ప్రభాతవార్త

ఉరవకొండ పట్టణంలో నేడు చౌడేశ్వరి అమ్మ వారి జ్యోతుల మహోత్సవం జరుగనుంది. చేనేత వర్గానికి చెందిన దేవాంగు లు, తొగటవీర క్షత్రీయులు వేరు వేరుగా ఈ ఉత్సవాన్ని నిర్వహిస్తున్నారు. జ్యోతుల మహోత్సవం గురువారం అర్ధరాత్రి 12 గంటలు దాటిన తరువాత మొదలై శుక్రవారం ఉదయం వరకు కొనసాగనున్నాయి. ఇందుకోసం పట్టణంలోని చౌడేశ్వరి అమ్మవార్ల ఆయాలను సర్వాంగ సుందరంగా ముస్తాబు చేశారు. మూడు రోజుల నుండి ఆలయాల్లో భజనలు కొనసాగుతున్నాయి. పట్టణంలోని క్లాక్ టవర్ మొదలు ప్రధాన కూడళ్ళు, ఆలయాలకు వెళ్లే రోడ్లలో ఎల్ఈడీ విద్యుత్ దీపాలతో భారీ ఎత్తున స్వాగత తోరణాలు దారి పొడవునా వెలుగులు విరజిమ్మేలా ఏర్పాట్లు చేశారు. జ్యోతుల ఉత్సవాల్లో పాల్గొనడానికిగాను జిల్లా నలుమూలల నుండి దేవాంగ, తొగటవీర క్షత్రీయులు వేలాదిగా ఉరవకొండకు చేరుకున్నారు. రాత్రంత్రా జ్యోతుల ఉత్సవం కొనసాగనుండగా అమ్మవారిని కీర్తిస్తూ ఖడ్గాలు, భజనలు, కోలాటాలకు అన్ని ఏర్పాట్లు చేసుకున్నారు. చేనేతలు అధికంగా ఉంటే కాలనీలు సందడి సందడిగా కనిపిస్తున్నాయి.




కోట చౌడేశ్వరి అమ్మవారి ఆలయం. ఇన్‌సెట్‌లో అమ్మవారి మూలవిరాట్, పురమానుకట్ట చౌడేశ్వరి అమ్మవారి ఆలయం. ఇన్‌సెట్‌లో అమ్మవారి మూలవిరాట్

## వెన్న అలంకారంలో వెంకటేశ్వర స్వామి

అగళి, జనవరి 14 ప్రభాతవార్త

ధనుర్మాసం ఆఖరి రోజున భోగి, సంక్రాంతి పండుగ సందర్భంగా అగళి కన్యక పరమేశ్వరి దేవాలయంలో వెంకటేశ్వర స్వామిని వెన్నతో అలంకరించారు. అయ్యప్పస్వామికి జ్యోతి భజన కార్యక్రమం కూడా నిర్వహించారు. అభిషేకాలు, మహా మంగళహారతి అనంతరం తీర్థప్రసాదాలతో కార్యక్రమాన్ని ముగించారు.

## జడ్పిటిసి ఉమేష్ ఆధ్వర్యంలో ఘనంగా సంక్రాంతి సంబరాల వేడుకలు



ఎమ్మెల్యే ఎంఎస్.రాజు, రాష్ట్ర టిడిపి ఉపాధ్యక్షులు గుండుమల ఫోటోలను రంగవల్లులు వేసిన దృశ్యం

అగళి, జనవరి 14 ప్రభాతవార్త

మండలంలో బుధవారం సంక్రాంతి సంబరాల వేడుకలు జడ్పిటిసి ఉమేష్ ఆధ్వర్యంలో ఘనంగా జరిగాయి. ఈ సంబరాలు అంబరాన్ని అంటాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విచ్చేసిన రాష్ట్ర టిడిపి ఉపాధ్యక్షులు గుండుమల తిప్పేస్వామి మాట్లాడుతూ.. సంక్రాంతి పండుగ ప్రజలకు సకల సౌఖ్యాలను అందించాలని, బోగి బోగ బాగ్యాలు అందించాలని, ప్రజల్లో కనుమ కమనీయ అనుభూతులను ప్రజల్లో నింపాలని ఆకాంక్షించారు. నర్సాంబూదికి చెందిన యువత ప్రత్యేకంగా ఎమ్మెల్యే ఎంఎస్.రాజు, రాష్ట్ర టిడిపి ఉపాధ్యక్షులు గుండుమల తిప్పేస్వామి రంగువల్లులో వాటిని గీశారు. ఈ రంగవళ్లులను చూసిన ప్రజలు సంతోషపడి సంతోష పడ్డారు.

## జై భీమ్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో క్రికెట్ టోర్నీ ప్రారంభం

అమరాపురం జనవరి 14 ప్రభాతవార్త



క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం దృశ్యం

అమరాపురం మండలపరిధిలోని కెంకెర గ్రామంలో బుధవారం భోగి సంక్రాంతి సందర్భంగా ప్రతి ఏటా గ్రామీణ ప్రాంతంలో ఉన్న యువకుల నైపుణ్యాన్ని బయట కి తీయడానికి జైభీమ్‌యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో క్రికెట్ టోర్నమెంట్ ను నిర్వహిస్తున్నట్లు జై భీమ్ యూత్ అసోసియేషన్ సభ్యులు తెలిపారు. ఈటోర్నమెంట్ను ముఖ్యఅతిథులుగా ఆర్‌చంద్రశేఖర్, ఉపాధ్యక్షులు నరసిం హప్ప, ప్రధాన కార్యదర్శి శివన్న తదితరులు పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా జై భీమ్ యూత్ అసోసియేషన్ అధ్యక్షులు మాట్లాడుతూ గ్రామంలో పోటీలను మరియు సాంస్కృతిక కార్యక్రమాలను చేపడితే గ్రామీ ణ ప్రాంతంలో ఉన్న విద్యార్థులు చైతన్యవంతులు కావడానికి ఆస్కారం ఉందన్నారు. క్రీడలు యువకులకు దేహదారుఢ్యంతోపాటు ఆరోగ్యకరంగా ఉండడానికి మరియు మానసిక ఉల్లాసానికి అవకాశం ఉందన్నారు. క్రీడాకా రులు గెలుపు ఓటములను సమానంగా స్వీకరించాలని ఈ సందర్భంగా చంద్రశేఖర్ తెలిపారు .ఇందులో మొదటి బహుమతి పొందిన విజేతలకు 12 వేల రూపాయలను, ద్వితీయ బహుమతి పొందిన విజేతలకు 6 వేలు రూపాయలను ఇవ్వనున్నట్లు జై భీమ్ యూత్ అసోసియేషన్ యువకులు తెలియజేశారు, ఈ కార్యక్రమంలో జై భీమ్ యూత్ అసోసియేషన్ అధ్యక్షులు ఆర్ చంద్రశేఖర్ , ఉపాధ్యక్షులు నరసింహప్ప, ప్రధాన కార్యదర్శి శివన్న , జై భీమ్ యూత్ అసోసియేషన్ యువకులు, ప్రభాకర్ మారుతి, శివరాజ్, మంజునాథ్, భరత్, , భూతరాజ్, హనుమంతరాయ, ఆటో మను, యానిమేటర్ సిద్దేశ్వర, జై భీమ్ యూత్ అసోసియేషన్ యువకులు క్రికెట్ క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు

## గవిమఠంలో జరగాల్సిన ముగ్గుల పోటీలు రద్దు

-మహిళలు ఆసక్తికనబర్చని వైనం

ఉరవకొండ, జనవరి 14 ప్రభాతవార్త

సంక్రాంతి పండుగను పురస్కరించుకొని ఉరవకొండ పట్టణంలోని ప్రసిద్ధ గవిమఠ సంస్థానంలో బుధవారం జరుగాల్సిన ముగ్గుల పోటీలు రద్దయ్యాయి. పోటీల్లో పాల్గొనాలనుకునే మహిళలు ముందుగా పేర్లు నమోదు చేసుకోవాలని మఠం దేవాదాయ ధర్మాదాయశాఖ అధికారులు సూచించిననూ ముగ్గులు వేయడానికి మహిళలు ఆసక్తికనబర్చకపోవడంతో తప్పనిసరి పరిస్థితుల్లో పోటీలను రద్దు చేయాల్సి వచ్చినట్లు సమాచారం. దాదాపు 50వేల మంది వరకు జనాభా కల్గిన ఉరవకొండ పట్టణంలో ముగ్గుల పోటీలు నిర్వహించగా ముగ్గులు వేయడానికి మహిళలు ఆసక్తి చూపకపోవడం అందరినీ ఆశ్చర్యానికి గురిచేసింది.

## భోగి మంటల్లో జీవో ప్రతులను దగ్ధం చేసిన సీపీఎం

- ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పాలన ఉండాలని డిమాండ్

ఉరవకొండ, జనవరి 14 ప్రభాతవార్త



ఉరవకొండ అంబేద్కర్ విగ్రహం కూడలిలో జీవోల ప్రతులను దగ్ధం చేస్తున్న వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు

పట్టణంలోని రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ విగ్రహం కూడలిలో సీపీఎం అనుబంధ సంఘాలు బుధవారం వివిధ జీవో ప్రతులను దగ్ధంచేసి నిరసన తెలిపాయి. మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం స్థానంలో కొత్తగా తీసుకొచ్చిన వీబీ జీ రామ్ జీ పథకం, లేబర్ కోడ్స్ గెజిట్ ప్రతులు, నూతన విత్తన చట్టం, విద్యుత్ సవరణ బిల్లుల ప్రతులను భోగి మంటల్లో వేసి కాల్చివేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని యథాతథంగా కొనసాగించాలని, నూతన లేబర్స్ కోడ్స్, విత్తన చట్టం, విద్యుత్ సవరణ గెజిట్‌లను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కౌలు రైతు సంఘం జిల్లా అధ్యక్షులు ఎ.రంగారెడ్డి, నియోజకవర్గ కార్యదర్శి పెద్దముష్టూరు వెంకటేశులు, రైతు సంఘం నాయకులు బి.జ్ఞానమూర్తి, నారాయణ, ఓబన్న, మారెప్ప తదితరులు పాల్గొన్నారు.

## కళాకారుల చేతుల మీదుగా...సాహిత్య పరిమళాల పోస్టర్లు విడుదల

గోరంట్ల, జనవరి 14 ప్రభాతవార్త



పోస్టర్లు విడుదల చేస్తున్న కళాకారులు

ప్రజాకవి యోగి వేమన జయంతి సందర్భంగా గోరంట్లలో సాహిత్య పరిమ ళాలు సాహితీ సాంస్కృతిక వేదిక ఆధ్వర్యంలో శతకవు ల ఆత్మీయ సత్కారవేదిక పోస్టర్లను వేదిక నిర్వాహకులు గుమ్మయ్యగారిపల్లి మారెమ్మ దేవాలయంలో బుధవారం విడుదల చేశారు. ఈనెల 18వతేదీ ఆదివారం ఎస్ఎల్ఎన్ ఫంక్షన్ హాల్‌లో ఒకే వేదికపై వందమంది కవులనుసత్కరించి మెమొంటో ప్రశంసాపత్రం అందజేయనున్నారు. వేమన గురించి కవితా పఠనం చేసినందుకు గాను వివిధ జిల్లాల రాష్ట్రాల నుంచి వచ్చిన కవులు కవయిత్రులను ఈ వేదిక ద్వారా పరిచయం చేసి సత్కరించనున్నారు. ఈ సందర్భంగా కార్యక్రమ ఆహ్వాన ప్రతులను నిర్వాహకులు విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో జిఎం సురేష్, రచయిత నరెద్దుల రాజారెడ్డి, సుధాకర్‌రెడ్డి (టీచర్), మారెమ్మ ఆలయ ప్రధాన అర్చకులు డాక్టర్ దేవీస్వామి, నిర్వహణ బృందం పాల్గొన్నారు.

